
సాక్షి ఒడిశా

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,28,264లు, బంగారం 1గ్రాము 250 మిల్లీగ్రాములు, వెండి 22 గ్రాములు 940 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో స్వపరిపాలన దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు.

- 8లో



శ్రీమందిరం ఆర్థిక ఉపసంఘం సమావేశం

పూరీలోని జగన్నాథస్వామి శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి (సీఏఓ) రంజ కుమార్‌ దాస్‌ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో గురువారం ఆర్థిక సబ్‌ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సీఏఓ తెలిపారు.

- 8లో

న్యూస్‌రీల్‌

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బరంపురం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని బరంపురం మాజీ ఎమ్మెల్యే రమేష్‌ చంద్రచావ్‌ పట్నాయక్‌ అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో బరంపురం అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడమే కాకుండా, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను దత్తత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీడీవో చైర్మన్‌ సుభాష్‌ మహారణ, బీజేడీ నగర అధ్యక్షుడు విజయ్‌ సామల్‌, భీష్మాచారి చౌదరి పాల్గొన్నారు.

'నేత్రదానంపై చైతన్యవంతమవ్వాలి'



నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బరంపురం: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ చైతన్యవంతులై ముందుకు రావాలని ప్రొఫెసర్‌ కె.నాగేశ్వర్‌ సుబుద్ధి పిలుపునిచ్చారు. ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో ఎంకేసీజీ కంటి విభాగం సహకారంతో జాతీయ కంటిదాన ఫోర్ట్‌నైట్‌ వార్షికోత్సవాలు గత వారం రోజులుగా జరుగుతున్న నేపథ్యంలో ఎంకేసీజీ మెడికల్‌ ప్రాంగణంలో నేత్రదానంపై గురువారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేత్రదానం చేయడం వలన ప్రపంచంలో అంధత్వం నిర్మూలించబడుతుందన్నారు. కార్యక్రమంలో జమ్ముల సురేష్‌, ఎ.లక్ష్మీనారాయణ బాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథునికి కానుక

- రత్నాల హారం సమర్పించిన భక్తురాలు



శ్రీమందిరం సీఏవోకి హారం అందజేస్తున్న సుష్మా శర్మ

భువనేశ్వర్‌: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై నిత్య పూజలు అందుకుంటున్న జగన్నాథ స్వామివారికి ఓ భక్తురాలు రత్నాలు పొదిగిన బంగారు హారం కానుకగా సమర్పించింది. కానుకగా సమర్పించిన వాటిలో 1 హారంతో 2 కర్ణ కుండలాలు, 1 లాకెటు, 1 ఉంగరం ఉన్నాయి. వీటి సమగ్ర బరువు 268 గ్రాముల 500 మిల్లీ గ్రాములు. ఉత్తర ప్రదేశ్‌ గజియాబాద్‌ ప్రాంతానికి చెందిన సుష్మా శర్మ అనే భక్తురాలు, స్వామివారి అలంకరణకు ఈ ఆభరణాలు కానుకగా ఆలయ కార్యాలయంలో గురువారం సమర్పించినట్లు శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి సీఏవో రంజన కుమార్‌ దాస్‌ తెలిపారు. ఆమెకి స్వామి రథం కలప చెక్క, తాడు, వస్త్రం, మహా ప్రసాదం (నిర్మాల్య) అందజేసినట్లు తెలిపారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తి హత్య



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మణి

మల్కన్‌గిరి: జిల్లాలోని కోరుకొండ సమితి చింతాలవాడ పంచాయతీలో గురువారం ఉదయం మాణి మాడీ అనే మహిళపై కలిమెల సమితికి చెందిన దేవ్‌ మాడ్కమి అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. అయితే మణి కుటుంబ సభ్యులు దేవను కర్రలతో కొట్టి చంపేశారు. వెంటనే మృతదేహన్ని గ్రామ శివారులో చెట్టుకు కట్టేశారు. విషయం తెలుసుకున్న మల్కన్‌గిరి పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. హత్యకు కారణమైన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. హత్య నేరం రుజువైతే కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌ కీండో తెలిపారు.

భువనేశ్వర్‌ To భవానీపట్నం విమానయానం



ముస్తాబైన భవానీపట్న ఉత్కెలా విమానాశ్రయం

- జెండాఊపి ప్రారంభించిన సీఎం నవీన్‌ పట్నాయక్‌
- 1.15 గంటల ప్రయాణం
- టికెట్‌ ధర రూ.1,049

భువనేశ్వర్‌: కలహండి జిల్లా భవానీపట్నం నుంచి రాజధాని నగరం భువనేశ్వర్‌కు ప్రత్యక్ష విమానయాన సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ గురువారం ఉదయం పచ్చ జెండాఊపి ఈ సేవలను ప్రారంభించారు. భవానీపట్న ఉత్కెలా విమానాశ్రయం, స్థానిక బిజూ పట్నాయక్‌ అంతర్జాతీయ విమానాశ్రయం మధ్య వారానికి 2 రోజులు విమానయాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య ఎం.సింధియా వర్చువల్‌గా ఉత్కెలా విమానాశ్రయం ప్రారంభం, విమానయాన సౌకర్యాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్‌ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర వాణిజ్యం మరియు రవాణా మంత్రి టుకుని సాహు, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు, సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ విభాగం మంత్రి అశోక్‌ చంద్ర పండా పాల్గొన్నారు.



సువర్ణాధ్యాయం

కలహండి జిల్లాలో కొత్తగా నిర్మితమైన విమానాశ్రయం నుంచి విమానయాన సౌకర్యాలను ప్రారంభించడం ఒడిశా విమానయాన రంగానికి సువర్ణ అధ్యాయంగా చెప్పవచ్చు. కనెక్టివిటీ, వాణిజ్యం మరియు పర్యాటక రంగాల అభివృద్ధికి ఈ విమానాశ్రయం దోహదపడుతుంది. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తుందని ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ కనెక్టివిటీ పథకం ఉడే దేశ్‌ కీ ఆమ్‌ నాగరిక్‌ (ఉడాన్‌) పథకం కింద కలహండి జిల్లా భవానీపట్నలో ఉత్కెలా ఎయిర్‌స్ట్రిప్‌ ప్రారంభమవ్వడం విశేషం. రాష్ట్రంలో ఇది 5వ విమానాశ్రయంగా నిలుస్తుంది. స్థానిక బిజూ పట్నాయక్‌ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత ఝార్సుగుడ, జయపురం మరియు రౌర్కెలా ప్రాంతాల్లో ఉడాన్‌ ఎయిర్‌స్ట్రిప్‌లు ఏర్పాటైన విషయం తెలిసిందే.



పచ్చజెండా ఊపి విమానయాన సేవలను ప్రారంభిస్తున్న సీఎం నవీన్‌ పట్నాయక్‌

స్వల్ప వ్యయ ప్రయాసలు

ఉత్కెలా ఎయిర్‌స్ట్రిప్‌ నుంచి విమానయాన సేవల ప్రారంభంతో స్థానికుల సుదీర్ఘకాల కల సాకారం అయింది. అత్యంత స్వల్ప వ్యయ ప్రయాసలతో భవానీపట్న మరియు భువనేశ్వర్‌ ప్రాంతాల మధ్య విమానయాన సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈ రెండు ప్రాంతాల మధ్య ప్రయాణ సమయం నామమాత్రంగా 1 గంట 15 నిమిషాలు. ఒక్కో ప్రయాణికుడికి ప్రారంభ వన్‌ వే ఛార్జీ రూ.999గా నిర్ణయించారు. పన్నులతో సహా టిక్కెట్‌ ధర రూ.1,049లు. అధికారిక వెబ్‌సైట్‌ ప్రకారం సెప్టెంబర్‌ నెలకు ఉత్కెలా మరియు భువనేశ్వర్‌ మధ్య విమానయాన అన్ని టిక్కెట్లు అమ్ముడైపోయాయి.

ఉత్కెలా విమానాల వేళలు

వారానికి రెండు రోజులు ఉత్కెలా, బిజూ పట్నాయక్‌ అంతర్జాతీయ విమానాశ్రయం (బీపీఐఏ) మధ్య విమానయాన సౌకర్యం అందుబాటులో ఉంటుంది. మంగళవారం మరియు గురువారాల్లో ఈ సేవలు లభిస్తాయి. ఆయా రోజుల్లో స్థానిక బీపీఐఏ నుంచి ఉదయం 7.15 గంటలకు బయల్దేరి 8.25 గంటలకు ఉత్కెలా విమానాశ్రయం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొత్త విమానాశ్రయం నుంచి ఉదయం 8.50 గంటలకు బయలుదేరి 10 గంటలకు భువనేశ్వర్‌ విమానాశ్రయంలో ల్యాండ్‌ అవుతుంది.

ఆకర్షణీయమైన పర్యటన

మాణికేశ్వరి ఆలయం, ఫుర్లీ ఝరన్‌ జలపాతం, రావణధార జలపాతం, ఖరియాపటి వన్యప్రాణుల అభయారణ్యం వంటి ఆకర్షణీయమైన ప్రదేశాలు మరియు పర్యాటక ప్రదేశాలు ఉత్కెలా వద్ద విమాన కనెక్టివిటీతో అందుబాటులోకి వచ్చాయి. అనేక మంది పర్యాటకులను ఈ ప్రాంతాలు ఆకర్షిస్తాయి. కలహండి జిల్లా భవానీపట్న సాహిద్‌ రెండో మాఝీ వైద్య కళాశాల ఆస్పత్రికి చెందిన సీనియర్‌ వైద్యులు, ప్రొఫెసర్లు మరియు వ్యాపారవేత్తలు తరచూ రాజధాని నగరానికి రాకపోకలు చేసేందుకు ఈ సౌకర్యం అక్కరకు వస్తుంది. కలహండి తూర్పు ఒడిశా వాణిజ్య కేంద్రంగా పరిగణించబడుతుంది. విమానయాన అనుసంధానం ఈ ప్రాంతపు పర్యాటక, పారిశ్రామిక పురోగతిని వేగవంతం చేసి స్థానిక ప్రజల మనుగడని మరింత బలోపేతం చేస్తుంది.

వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా



ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌తో తొలి విమాన సిబ్బంది

21న శాసన సభ స్పీకర్‌ ఎన్నిక

- 22 నుంచి వర్షాకాల సమావేశాలు
- మంత్రివర్గంలోకి వెళ్లడంతో స్పీకర్‌ పదవికి విక్రమ్‌ కేసరి రాజీనామా

భువనేశ్వర్‌: రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలకు రంగం సిద్ధమైంది. ఈ సమావేశాలు ముందస్తు ఎన్నికలకు సంకేతంగా పలు వర్గాలు పరిగణిస్తున్నాయి. అనుబంధ బడ్జెటు ప్రవేశం, ఆమోదం ముగించి సమావేశాలకు తెరదించే అవకాశం లేకపోలేదు. ఈ సమావేశాల్లో ఖాళీగా ఉన్న స్పీకర్‌ పదవి భర్తీ చేస్తారు. ముందుగా ఈ ప్రక్రియ ముగించి వర్షాకాల సమావేశాలు ప్రారంభిస్తారు. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర గవర్నర్‌ ఆమోదం తెలపాల్సి ఉంది.

ప్రతిపాదిత షెడ్యూల్‌

సెప్టెంబర్‌ 21న శాసన సభ స్పీకర్‌ పదవికి ఎన్నిక ప్రతిపాదించారు. మరుసటి రోజు సెప్టెంబర్‌ 22 నుంచి రాష్ట్ర శాసన సభ వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతాయని అధికారిక వర్గాలు గురువారం తెలిపాయి. అక్టోబరు 4వ తేదీ వరకు ఈ సమావేశాలు నిరవధికంగా కొనసాగించేందుకు యోచిస్తున్నారు. సమావేశాలు ముగిసే ముందు రోజున సభలో అనుబంధ బడ్జెటు ప్రవేశ పెడతారు. ఇటీవల జరిగిన మంత్రి మండలి విస్తరణ పురస్కరించుకుని స్పీకర్‌ హోదాలో కొనసాగిన విక్రమ్‌ కేశరి అరూఖ్‌ రాజీనామా చేశారు. అప్పటి నుంచి స్పీకర్‌ పదవి ఖాళీగా ఉంది. విక్రమ కేశరి అరూఖ్‌ నామమాత్రంగా ఏడాది కాలం మాత్రమే బాధ్యతలు నిర్వహించారు. రజనీకాంత్‌ సింఘ్‌ తాత్కాలిక స్పీకర్‌గా వ్యవహరిస్తున్నారు. మే 23న ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ తన మంత్రివర్గం విస్తరణ పురస్కరించుకుని నవీన్‌ పట్నాయక్‌ కొలువులో విక్రమ కేశరి అరూఖ్‌కు ఆర్థిక శాఖ కేటాయించారు.

స్పీకర్‌ ఎన్నిక

స్పీకర్‌ పదవి భర్తీకి సెప్టెంబర్‌ 18వ తేదీన నామినేషన్‌ పత్రాల దాఖలు నిర్వహిస్తారు. దస్తావేజుల పరిశీలన వగైరా పూర్తి చేసి 21వ తేదీన స్పీకరు పదవికి ఎన్నిక జరుగుతుంది. మరుసటి రోజు నుంచి వర్షాకాల సమావేశాలు ప్రారంభమవుతాయి. ఈసారి జరగనున్న వర్షాకాలం సమావేశాల్లో అనుబంధ బడ్జెటు పరిమాణం సుమారు రూ.25 వేల కోట్లు వరకు ఉంటుందని సమాచారం. ఈ బడ్జెటు ఆమోదంతో సమావేశాలకు తెరపడడంతో ముందస్తు ఎన్నికలకు తీర్మానం ఆమోదం పొందే అవకాశం ఉంది. ఈ అంచనా ప్రకారం ఈ ఏడాది నవంబర్‌ లేదా డిసెంబర్‌ నెలలో ముందస్తు అసెంబ్లీ ఎన్నికలపై సందడి నెలకొని ఉంది.

ఉపాధి అవకాశాలు కల్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న యువజన కాంగ్రెస్‌ కార్యకర్తలు

- యువజన కాంగ్రెస్‌ కమిటీ ఆందోళన

రాయగడ: జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని యువజన కాంగ్రెస్‌ కమిటీ సభ్యులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఏళ్ల తరబడి ఉన్న పరిశ్రమల వలన నిరుద్యోగులకు ఒరిగిందేమీ లేదని, కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమల్లోనైనా యువతకు అవకాశాలు కల్పించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పేరిట వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్‌ నారాయణ మిశ్రాకు అందజేశారు. యువజన కాంగ్రెస్‌ కమిటీ ఉపాధ్యక్షుడు అస్లామ్‌ ఖాన్‌ మాట్లాడుతూ.. డీఎంఆర్‌ (డిస్టట్‌ మినరల్‌ ఫండ్‌) ద్వారా వస్తున్న నిధులతో ప్రభుత్వం రాయగడలో మెడికల్‌ కళాశాల నిర్మించాలని డిమాండ్‌ చేశారు. అదేవిధంగా పరిశ్రమల పరిసర ప్రాంతాలను పరిశ్రమ యాజమాన్యం అభివృద్ధి పరిచి, ఆయా ప్రాంతాల్లోని వారికి కనీస మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు. పరిశ్రమలతోనే ప్రగతి సాధ్యపడుతుందని భావించి ఎంతో మంది పరిశ్రమల ఏర్పాటుకు తమ సొంత భూములు, ఇళ్ల స్థలాలను ఇస్తే చివరికి వారికి మిగిలింది శూన్యమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కాశీపూర్‌లో బాక్సైట్‌ తవ్వకాలకు తాము మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. పరిశ్రమల ఏర్పాటుకు తామేప్పుడూ వ్యతిరేకులం కాదన్నారు. ఆందోళనలో అసెంబ్లీ యువజన కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు జోషఫ్‌ కొషల, హరీష్‌ పట్నాయక్‌, జిల్లా కాంగ్రెస్‌ కమిటీ ఉపాధ్యక్షుడు శంకర్షన్‌ మంగరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌ మిశ్రాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుణుపూర్‌లో డుడా డైరెక్టర్‌ పర్యటన



గుణుపూర్‌ సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న గౌమాంగో

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో బుధవారం సాయంత్రం జిల్లా పట్టణాభివృద్ధి సంస్థ(డుడా) డైరెక్టర్‌ గోరాచంద్‌ గౌమాంగో పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. బవురివీధి, గొలావీధిలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. అదేవిధంగా బఘువా మందిరం సమీపంలో డ్రైనేజీలను సందర్శించారు. కొత్త బస్టాండ్‌లో ఇటీవల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మితమైన పట్టణ సుందరీకరణ పనులను చూశారు. అనంతరం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి డాక్టర్‌ సత్యసంపూర్ణ రౌత్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మమత గౌడొ, వైస్‌ చైర్మన్‌ శివప్రసాద్‌ గౌడోలతో సమావేశమయ్యారు. ముక్తా పథకంలో భాగంగా కొద్ది నెలలుగా గుణుపూర్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులపై సమీక్షించారు.

పెట్రోలు బంకు ప్రారంభోత్సవంలో రసాభాస

- బీజేడీ, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ



బంకు ప్రారంభోత్సవాన్ని అడ్డుకుంటున్న బీజేపీ శ్రేణులు



బీజేపీ నిరసనను ప్రతిఘటిస్తున్న బీజేడీ నాయకులు



సంఘటన అనంతరం మోహరించిన పోలీసులు

పర్లాకిమిడి: స్థానిక జంగంవీధి జంక్షన్‌ వద్ద రీజనల్‌ మార్కెటింగ్‌ కో-ఆపరేటివ్‌ సొసైటీస్‌(ఆర్‌ఎంసీఎస్‌) ఆధ్వర్యంలో నిర్మించిన ఇండియన్‌ ఆయిల్‌ పెట్రోలు బంకు ప్రారంభోత్సవంలో అధికార బీజేడీ, ప్రతిపక్ష బీజేపీ నాయకుల మధ్య రాసాభాస చోటుచేసుకుంది. బంకు ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలకంలో స్థానిక ఎమ్మెల్యే కె.నారాయణరావు పేరు లేదని ఆరోపిస్తూ బీజేపీ శ్రేణులు సిద్దేశ్వర మిశ్రా, ఈ.ప్రశాంత్‌, బాలకృష్ణ పాత్రో, సంజయ్‌, కోడూరు రమణ తదితరులు నినాదాలు చేశారు. దీంతో ఆర్‌ఎంసీఎస్‌ అధ్యక్షులు ఎస్‌.గజపతిరావు, ఇతర డైరెక్టర్లు బీజేపీ నాయకులను ప్రతిఘటించారు. దీంతో ఒక దశలో ఇరు పార్టీల నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఇంత జరుగుతున్నా పోలీసులు సంఘటన స్థలానికి సమయానికి రాలేకపోయారు. తదనంతరం బీజేడీ నాయకుడు తిరుపతి పాణిగ్రాహి సంఘటన స్థలానికి విచ్చేసి గజపతిరావు చేతులమీదుగా కొబ్బరి కాయ కొట్టించి ప్రారంభోత్సవం అయిందనిపించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎంపీ చంద్రశేఖర సాహును పిలవడం జరిగింది. అయితే ఆయన పర్లాకిమిడి రావడానికి ఆలస్యం అయ్యింది.

చైన్‌ స్నాచర్ల ముఠా గుట్టురట్టు

- నలుగురు వ్యక్తులు అరెస్టు



పట్టుబడిన నిందితులు

జయపురం: కొరాపుట్‌, నవరంగపూర్‌ జిల్లాల్లోని చైన్‌ స్నాచర్ల ముఠా గుట్టు పోలీసులు రట్టు చేశారు. జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌ సభాగృహంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో రెండు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు. జయపురం, నవరంగపూర్‌ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు జరిపి చైన్‌ స్నాచర్ల ముఠాను పట్టుకున్నట్లు తెలియజేశారు. అరెస్టైన వ్యక్తులు కుంద్రా సమితికి చెందిన నరేంద్ర మచ్చ(22), అభి హరిజన్‌(21), హేమంత నాగ్‌(24), జయపురం సమితికి చెందిన కలియాగాంకు చెందిన సుభాష్‌ హరిజన్‌(24)లుగా స్పష్టం చేశారు. వారి నుంచి కొరాపుట్‌ పట్టణ పోలీసుస్టేషన్‌ కేసులకు సంబంధించి 4 బంగారు గొలుసులు, నవరంగపూర్‌ పోలీసుస్టేషన్‌లో కేసులకు సంబంధించి 2 బంగారు గొలుసులు, జయపురం పట్టణ పోలీసుస్టేషన్‌ కేసులో ఒక బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

కేసుల వివరాలు వెల్లడి

ఈనెల 20వ తేదీన కొరాపుట్‌ ట్రాఫిక్‌ కూడలి వద్ద 55ఏళ్ల భాగ్యలక్ష్మీ పండా కాయగూరలు కొంటుండగా ఆమె మెడలో బంగారు గొలుసును ముగ్గురు దుండగులు తెంచుకొనిపోయారు. అలాగే 23వ తేదీన నవరంగపూర్‌ గదబవలసలో జమామణి బిశాయి(71) మెడలో రెండు బంగారు గొలుసులు ముగ్గురు దుండగులు అపహరించారని వెల్లడించారు. అదేవిధంగా ఈనెల 29వ తేదీ సాయంత్రం 7 గంటల సమయంలో జయపురం ప్రసాదరావుపేట వి.జయలక్ష్మి నడచి వెళ్తున్న సమయంలో ఆమె మెడలోని బంగారు గొలుసును ముగ్గురు వ్యక్తులు తెంచుకుపోయారని వివరించారు. దీంతో చైన్‌ స్నాచర్లను పట్టుకునేందుకు నవరంగపూర్‌, జయపురం పోలీసులతో ఒక టీమ్‌ ఏర్పాటు చేశామని, పై కేసుల్లో దొంగిలించబడిన బంగారు గొలుసులతో పాటు నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. దొంగిలించిన గొలుసులను సుభాష్‌ హరిజన్‌కు అమ్మారని, అతడు మాథూర్‌ ఫైనాన్స్‌లో ఒక బంగారు గొలుసు తాకట్టు పెట్టారపేర్కొన్నారు. సమావేశంలో జయపురం సబ్‌ డివిజన్‌ పోలీసు అధికారి హరీష్‌ బీసీ, జయపురం పట్టణ పోలీసు అధికారి సత్యానంద పాత్రో, నవరంగపూర్‌ పట్టణ పోలీసు అధికారి సందీప్‌ కుమార్‌ బెహర, నవరంగపూర్‌ సబ్‌ డివిజనల్‌ పోలీసు అధికారి నిహారంజన్‌ ప్రధాన్‌, నవరంగపూర్‌ అదనపు ఎస్పీ భటకృష్ణ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పూజలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: జాజ్‌పూర్‌లో కొలువైన ఉత్తరాది శ్రీవైభవ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణ పూర్ణిమ పురస్కరించుకుని ప్రత్యేక పూజాదులు గురువారం నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం సత్యనారాయణ స్వామివారి వ్రతం సామూహికంగా నిర్వహించినట్లు పాలక మండలి సభ్యులు తెలిపారు. జాజ్‌పూర్ ప్రాంతంలోని ప్రవాసాంధ్రులు పెద్ద సంఖ్యలో ఈ వ్రతంలో పాలుపంచుకున్నారు.

వైద్య విధాన్ పరిషత్‌లో 21 ఉద్యోగాలకు నోటిఫికేషన్

అరసవల్లి: ఏపీ వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో మొత్తం 21 ఖాళీలను కాంట్రాక్ట్ /ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు ఆసక్తి గల అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లుగా జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ భాస్కరరావు ఓ ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాప్తికి ఈ నోటిఫికేషన్ విడుదల చేశామని, 8 రకాల పోస్టుల భర్తీ కోసం ఈనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఔట్ సోర్సింగ్ విధానంలో థియేటర్ అసిస్టెంట్–7, ల్యాబ్ అటెండెంట్ –4, ఆఫీస్ సబార్డినేట్ - 2 పోస్టులను, అలాగే కాంట్రా క్ట్ విధానంలో ల్యాబ్ టెక్నీషియన్ –4 ,ఆడియో మె ట్రీషియన్ –1, ఫిజియోథెరపిస్టు– 1, ఎలక్ట్రీషియన్ – 1, రేడియోగ్రాఫర్ –1 పోస్టులను భర్తీ చేయనున్నట్లుగా ప్రకటించారు. మరిన్ని వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ శ్రీకాకుళం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



పోలీసుల సమక్షంలో బంగారం అందిస్తున్న ఆటో డ్రైవర్

టెక్కలి రూరల్: తన ఆటోల ప్రయాణికుడు మర్చి పోయిన బ్యాగ్‌ను మళ్లీ అతనికి అందించి ఓ ఆటో డ్రైవర్ తన నిజాయితీ చాటుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం .. మెళియాపుట్టి మండ లం వసుధర గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ హెచ్ సీ రవిశంకర రావు గురువారం టెక్కలి మండలం బొప్పాయిపురం గ్రామానికి ఆటోలో వచ్చాడు. అయితే 8 తులాల బంగారం ఉన్న బ్యాగ్‌ను ఆటోలోనే మర్చిపోయి దిగిపోయాడు. ఇంటికి వెళ్లాక బ్యాగు సంగతి గుర్తుకువచ్చి ఆటో కోసం వెతికినా దొరకలేదు. చివరకు టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతలో ఆటో డ్రైవర్ జోగి కృష్ణ కూడా బ్యాగు ఇవ్వడానికి యజమాని కోసం కోసం గాలించి ఎక్కడా కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి చెప్పారు. దీంతో పోలీసులు ఆటో డ్రైవర్ నిజాయితీని పోలీసులు అభినందించారు. ఎస్‌ఐ రామకృష్ణ సమక్షంలో బాధితులకు బంగారం అందజేశారు. అనంతరం ఆటో డ్రైవర్ నిజాయితీని గుర్తించి నగదు బహుమతి అందించారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న రసాయనశాస్త్రం, కంప్యూటర్ సైన్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఈనెల 2 శనివారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రంకు సంబంధించి ఎమ్మెస్సీ రసాయన శాస్త్రంలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలని అదనంగా ఏపీసెట్, నెట్‌తో పాటు పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే కంప్యూటర్ సైన్స్ పోస్టుకు సంబందించి ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ గాని ఎంసీఏ గానీ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. అదనంగా ఏపీ సెట్, నెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ గోవిందమ్మ పేర్కొన్నారు. అభ్యర్థులంతా అన్నిరకాల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆమె కోరారు. అలాగే డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఆనర్స్ రసాయనశాస్త్ర, ఎకనామిక్స్, కామర్స్ చదవాలనుకునే విద్యార్థులంతా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రకటించారు.

వైభవంగా విఖనస నారాయణుల జయంతి

ఇచ్ఛాపురం: మానవాళికి భక్తిమార్గం చూపిన విఖనస నారాయణుల జయంతి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం శ్రీకోదండరామాస్వామి దేవాలయం, శ్రీ జగన్నాథ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సృష్టి పూర్తయిన తర్వాత మానవుల్లో చైతన్యం కలిగించి దైవచింతన కలిగించేలా చేసిన మహావిష్ణువు ఆలోచనల నుంచి ఉద్భవించిన విఖనస నారాయణులు ప్రస్తుతం వాడుకలో ఉన్న పూజా విధానం గురించి లోకానికి చాటి చెప్పారు.



జయపురం: జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న దృశ్యం



కొరాపుట్: జిమ్ ప్రారంభిస్తున్న దృశ్యం



పర్లాకిమిడి: మినీ పార్కును ప్రారంభించిన ఎంపీ చంద్రశేఖర సాహు తదితరులు



పర్లాకిమిడి: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో మున్సిపాలిటీ స్వపరిపాలన దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో ముఖ్య అతిథిగా హాజరై కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. అందరి సహకారంలో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఇప్పటికే మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి డాక్టర్ సత్యసంపూర్ణ రౌత్ మున్సిపాలిటీ వార్షిక నివేదికను చదివి వినిపించారు. అనంతరం కొత్తగా మంజూరైన పెన్షన్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఉత్తమ సేవలందించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మమత గౌడో, వైస్ చైర్మన్ శివప్రసాద్ గౌడో తదితరులు పాల్గొన్నారు.

బరంపురం: ఒడిశా రాష్ట్రంలో మొట్టమొదటి మున్సిపాలిటీ బరంపురంలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడంతో



పర్లాకిమిడి: మహిళా సంఘాలకు ముక్తా పథకం కింద వర్క్ ఆర్డర్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాటు ఎస్ఎస్‌జీ మహిళల స్టాల్స్‌ని మేయర్ సంఘమిత్ర దొళాయి ప్రారంభించారు. అనంతరం బీఎంసీ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షలో గౌరవ అతిథులుగా దక్షిణాంచల్ డీఐజీ సత్యబ్రాత్ బొయి మరియు ఎంపీ చంద్రశేఖర్ సాహులు పాల్గొన్నారు. కార్యక్రమాలకు కమిషనర్ సోనాలి జెనా, ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు హాజరయ్యారు.

పర్లాకిమిడి: స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పర్లాకిమిడి పురపాలక సంఘంలో ప్లాస్టిక్ నిషేధించామని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు. అనంతరం స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టి స్థానిక మెడికల్ వద్ద మహారాజా డైమండ్ జుబ్లీ కుష్టు రోగుల నివారణ పునరావాస కేంద్రంలో రోగులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం పాతపట్నం రోడ్డులో ఉన్న చిరువ్యాపారుల వెండింగ్ జోన్ దుకాణాలను ఎంపీ చంద్రశేఖర సాహు చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు నాయకులు లక్ష్మీకాంత పోరిచ్చా, బసంత్ దాస్, పురపాలక ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వనమాళి శతపతి, వైస్ చైర్మన్ లెంక మధు తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లా కాశీనగర్ నోటిఫైడ్ కౌన్సిల్‌లో స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ చంద్రశేఖర సాహు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. తొలుత ఎంపీ చంద్రశేఖర సాహు ముక్తా పథకం కింద 11వ వార్డులో మెడికల్ వద్ద జిమ్, ఒక మినీ పార్కును ప్రారంభించారు. అనంతరం శ్రీరాం డిగ్రీ కళాశాలలో ఎంపీ నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాశీనగర్ ఎన్‌ఏసీ అధ్యక్షురాలు మేడిబోయిన సుధారాణి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, వైస్ చైర్మన్ రఘురాం సాహు, కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పురపాలక సంఘ కార్యాలయంలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్ జాతీయ జెండా ఆవిష్కరించారు. పురపాలక సంఘ అధ్యక్షుడు లలెటెందు రంజన్ శెఠి మాట్లాడుతూ.. కొరాపుట్ పట్టణం రాష్ట్రంలో అభివృద్ధి పథంలో ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కమలోచన్ మిశ్రా, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, మున్సిపల్ చైర్మన్ కును నాయక్‌లు పాల్గొన్నారు.

జయపురం: పట్టణ అభివృద్ధికి జయపురం మున్సిపల్ కౌన్సిల్ కృత నిశ్చయంతో పనిచేస్తోందని మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి వెల్లడించారు. గురువారం జాతీయ స్వయం పాలన దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గున్నారు.

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను నిర్వాహక అధికారి సిద్దార్ధ పట్నాయిక్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పెర్సన్ బి.సునీత తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



బరంపురం: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సంఘమిత్ర దొళాయి



బరంపురం: మహిళా సంఘాల సభ్యులతో మేయర్ సంఘమిత్ర దొళాయి తదితరులు



రాయగడ: గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీమందిరం ఆర్థిక ఉపసంఘం సమావేశం

- 2023–24 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌పై చర్చ
- పరమాణిక్ సేవ పునరుద్ధరణకు చర్యలు
- నియమిత సిబ్బందికి ఆరోగ్య బీమా



ఆర్థిక సబ్ కమిటీ సమావేశం దృశ్యం

భువనేశ్వర్: శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి (సీఏఓ) రంజ కుమార్ దాస్ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో గురువారం ఆర్థిక సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సీఏఓ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్ ప్రతిపాదనలు పరిశీలించారు. ఈ ప్రతిపాదనలు దాదాపు 80 శాతం ఆమోదయోగ్యంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

యూనిఫాం నియమావళి

శ్రీమందిరం సిబ్బందికి ప్రత్యేక వస్త్రధారణ నియమావళి (యూనిఫాం) కార్యాచరణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. లోగడ ప్రతిపాదించిన నియమావళి వాస్తవ కార్యాచరణలో స్వల్ప అడ్డంకులతో అమలు సాధ్యం కాలేకపోయింది. ఈ మేరకు సత్వర చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

హుండీల ఏర్పాటు

పలు ప్రాంతాల నుంచి వచ్చిపోయే భక్తులు, యాత్రికుల నుంచి విరాళాల సేకరణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ చర్యల్లో భాగంగా అదనంగా 4 హుండీలు ఏర్పాటు చేస్తారు. వీటిలో ఒకటి శ్రీమందిరం లోపల, మిగిలిన మూడు ఆలయం వెలుపల వేర్వేరు చోట్ల విరాళాల సేకరణ కోసం ఏర్పాటు చేయాలని ఆర్థిక సబ్ – కమిటీ నిర్ణయించింది. ఆలయం వెలుపల శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణ మణికేశ్వరి మందిరం పరిసరాలు, పశ్చిమ ద్వారం యూకో బ్యాంకు పరిసరాలు, ఉత్తర ద్వారం పరిసరాల్లో హుండీలు ఏర్పాటు అవుతాయి. అలాగే ఆలయం లోపల శ్రీ మందిరం సముదాయం మహాలక్ష్మీ ఆలయం ప్రాంగణంలో ఒక హుండీ ఏర్పాటు చేస్తారని ప్రధాన పాలన అధికారి (సీఏఓ) తెలిపారు.

భక్తి నివాస్‌లో టీవీలు

పట్టణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న శ్రీమందిరం భక్తి నివాస్ గదుల్లో టీవీ ఏర్పాటు ప్రతిపాదనకు సబ్ కమిటీ ఆమోదించింది. ఈ సౌకర్యం త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు. నీలాచల్, నీలాద్రి, గుండిచా, పురుషోత్తం భక్తి నివాస్ సముదాయాల్లో టీవీ సౌకర్యం ఏర్పాటుకు సబ్ కమిటీ అంగీకరించింది. రోహిణి కుండ్ మరియు గుండిచా దేవాలయం నిర్వహణ వేలం కోసం త్వరలో నిర్ధారిత కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) సిద్ధం చేయబడతాయి.

పరమాణిక్ సేవ పునరుద్ధరణ

శ్రీమందిరంలో స్వామి దర్శనం కోసం ఆర్జిత సేవ పునరుద్ధరణకు సబ్ కమిటీ ఆమోదించింది. లోగడ అమలు చేసిన పరమాణిక్ (ఆర్జిత) సేవ మరోసారి ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఈ సేవ కార్యాచరణ కోసం ఎస్ఓపీ సిద్ధం చేస్తారు.

ఆరోగ్య బీమా

శ్రీమందిరం రెగ్యులర్ సిబ్బందికి కల్పిస్తున్న ఆరోగ్య బీమా పథకం కార్యాచరణలో స్వల్ప మార్పులు చేపట్టారు. ఈ పథకం ప్రవేశంతో నియమిత సిబ్బందికి మంజూరయ్యే 0.65 శాతం వైద్య భృతి, మందుల ఖర్చులు చెల్లింపు నిలిపివేశారు. ఈ నేపథ్యంలో స్వల్ప సవరణలు చేపట్టేందుకు సబ్ కమిటి నిర్ణయించింది. తాజా తీర్మానం మేరకు నియమిత సిబ్బంది ఏటా రూ.12 వేల చొప్పున మందుల ఖర్చుల కింద పైకం పొందుతారు. 24 గంటలు పైబడి చికిత్స కోసం ఆస్పత్రిలో భర్తీ అయితే ఆరోగ్య బీమా పరిధిలో పరిగణించి సేవలు కల్పిస్తారు. ఆర్థిక ఉపసంఘం సమావేశం అనంతరం శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి (సీఏఓ) రంజన్‌కుమార్ దాస్ ఈ విషయం తెలిపారు. సమావేశంలో ఆర్థిక ఉపసంఘం సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగిన రాఖీ వేడుకలు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో సీఆర్పీఎఫ్ జవాన్లకు రాఖీలు కడుతున్న మహిళలు



కొరాపుట్: నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానికి శుభాకాంక్షలు తెలుపుతున్న బ్రహ్మకుమారీలు

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో రాఖీ పండగ ఉత్సవాలు గురువారం కొనసాగాయి. వేడుకల్లో తెలుగు ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు. బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ ఆర్మీ క్యాంప్‌ల వద్దకు పెద్ద ఎత్తున్న మహిళలు చేరి జవానులకు రాఖీలు కట్టారు. ఓం శాంతి ఈశ్వరీయ బ్రహ్మకుమారి విశ్వ విద్యాలయం మహిళలు నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానికి రాఖీ కట్టారు. అలాగే కొరాపుట్, నబరంగ్‌పూర్, ఉమ్మర్ కోట్ జైళ్ల వద్ద కన్నీటి వాతావరణం నెలకొంది. జైలు ఖైదీలకు రాఖీలు కట్టడానికి మహిళలు బారులుతీరారు. ములాఖాత్ కిటికీ వద్ద ఖైదీలు లోపలి నుండి చేయి అందించగా, బయట నుంచి వారి బంధువులు రాఖీలు కట్టారు. చిన్నచిన్న పెట్టీ కేసుల్లో సెలవుల వలన బెయిల్ దొరకని వారి బాధ వర్ణనాతీతం ఉంది. గతంలో వలే ఆ ప్రాంతంలో కెమేరాలకు సిబ్బంది అనుమతి ఇవ్వలేదు.

ఎస్పీకి రాఖీ కట్టిన మాజీ మావోయిస్టులు

మల్కన్‌గిరి: జిల్లా ఎస్పీ నితీష్ వాద్వానీకి మాజీ మహిళా మావోయిస్టులు రాఖీ కట్టారు. రాఖీలు కట్టడం ఎంతో ఆనందంగా ఉందని మావోయిస్టులు కౌసల్య ఖీలో(ఏసీఎం), సంగీతా ఖోర(పార్టీ మెంబర్), నాగి కుర్మి (పార్టీ మెంబర్), ఐతే కర్తమి (పార్టీ మెంబర్) హర్షం వ్యక్తం చేశారు. వీరికి ఎస్పీ బహుమతులు అందజేశారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు అందజేస్తామని తెలియజేశారు.



ఎస్పీకి రాఖీలు కడుతున్న మాజీ మహిళా మావోయిస్టులు

అమ్మవారికి నక్షత్ర హారతి



అమ్మవారికి నక్షత్ర హారతి ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి నదీ తీరా న ఉన్న బాలత్రిపుర కాలభైవర పీఠం దేవాలయంలో అమ్మవారికి శ్రావణ పౌర్ణమి సంద ర్భంగా నక్షత్ర హారతి నిచ్చారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురుజీ ఆధ్వర్యంలో పూజలు చేశారు.

హెచ్‌ఎం వ్యవహారంపై డీఎస్పీ ఆరా

గార: వమరవల్లి ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి విద్యార్థినిపై అనుచితంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదు అనంతరం డీఎస్పీ వై.శృతి గురువారం ఘటనపై ఆరా తీశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. గ్రామపెద్దల నుంచి సమాచారం సేకరించారు. ఆమె వెంట సీఐ ఎస్.కామేశ్వరరావు ఉన్నారు.

అంతా ఐనవాళ్లమే..!

- ఒకరి నేత్రదానంతో ఇద్దరికి కంటిచూపు
- అవగాహన లేక మట్టిపాలవుతున్న అవయవాలు
- సెప్టెంబర్ 8 వరకూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు



ఇచ్ఛాపురం రూరల్: కొందరు తమ బతుకంతా అమ్మను వినడమే గానీ చూడలేరు. ఇంకొందరు నాన్న వేలు పట్టుకుని నడవడమే తప్ప తండ్రి రూపు రేఖలు తెలుసుకోలేరు. మరికొందరు చుట్టూ ఉన్న లోకం గురించి తెలుసుకోవడం తప్ప ఆ అందాలను ఆస్వాదించలేరు. కానీ వీరిలో చాలా మందికి చూపు వచ్చే అవకాశం ఉంది. అందుకు ఏకైకమార్గం నేత్రదానం. మనిషి చనిపోయాక నేత్రాలను దానం చేస్తే ఆ కళ్లు ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు ప్రసాదిస్తాయి. ఇలా దానాలతో చూపులు ప్రసాదించగలిగితే అందరం అయినవాళ్లమే అవుతాం.

ఇదే అంశంపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావడానికి ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకూ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. కంటి చూపు లేనివారికి ఒకరి నుంచి సేకరించిన రెండు కళ్లలో ఒకటి అమర్చినా, అలా ఇద్దరికి చూపు వచ్చే అవకాశం ఉంటుందని, నేత్రదానానికి ప్రజలు ముందుకు రావాలని వైఎస్సార్ కంటి వెలుగు సిబ్బంది జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రచారం కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2009 నుంచి ఇప్పటి వరకు 482 మంది నుంచి కార్నియాలు సేకరించి 777 మందికి అమర్చారు.

కార్నియా అంధత్వం

కంటి ముందు భాగంలోని నల్లటి భాగాన్ని కప్పి ఉంచే పొరను కార్నియా అంటారు. ఏటా వందల మంది కార్నియా అంధులుగా మారుతున్నారు. వీరిలో 50 శాతం మంది యువతీ, యువకులు, చిన్నపిల్లలే విటమిన్–ఏ లోపం, పౌష్టికాహార లేమి, ప్రమాదాలు, గాయాలు, శస్త్ర చికిత్సలతో వచ్చే ఇన్‌ఫెక్షన్‌లతో కార్నియా అంధత్వం వస్తుంది. మనిషికి 50 ఏళ్లు దాటాక కళ్లలో శుక్లాలు వస్తాయి. శస్త్రచికిత్సల ద్వారా చూపు వస్తుంది. కార్నియా అంధత్వానికి నేత్రాల కార్నియా మార్చిడే మార్గం. కార్నియా దెబ్బ తిని చూపు కోల్పోయిన వారు రోజురోజుకూ పెరుగుతున్నా, నేత్రదానం చేసే వారు పెరగడంలేదు. నేత్రదానానికి ముందుకు వచ్చిన వారిలో కొందరు మృత్యువాత పడిన సమయానికి వారి కళ్లను దానం చేయలేకపోతున్నారు.

ఎవరు అర్హులు..?

- ప్రమాదవశాత్తు గుండెజబ్బులు తదితర దీర్ఘకాలిక జబ్బులతో మరణించిన వారు, సహజ మరణం పొందిన వారు నేత్రదానం చేయడానికి అర్హులు.
- ఏ వయస్సు వారైనా, కంటి అద్దాలు ధరించిన వారైనా, షుగర్ వ్యాధిగ్రస్తులు, అధిక రక్తపోటు ఉన్న వారైనా మరణానంతరం నేత్రదానం చేయవచ్చు.
- నేత్రదానం చేసిన తరువాత కృత్రిమ కళ్లను మృతుడికి అమర్చుతారు.
- అంతిమ సంస్కారాలకు ఇబ్బంది ఉండదు.
- 18 ఏళ్లు నిండిన వారు వయస్సుతో సంబంధం లేకుండా నేత్రదానం చేయవచ్చు.

ఎవరు దానం చేయకూడదు..

- హెచ్‌ఐవీ, కామెర్లు, కుష్టు వ్యాధి, రుబెల్లా, సిఫిలిస్ వంటి వ్యాధిగ్రస్తులు, కరోనా పాజిటివ్, హైపటైటిస్ ఉన్నవారు నేత్రదానానికి అనర్హులు.
- పాముకాటు వల్ల, కుక్కకాటు వల్ల మరణించిన వారు, నీటిలో మునగడం వల్ల, ఒళ్లు కాలడం వల్ల మరణించినవారు, కంటిపాపపై తెల్లని మచ్చలు, కంటిలో నీటి కాసుల వ్యాధి ఉన్నవారు నేత్రదానానికి అర్హులు కారు.

కార్నియా సేకరణ ఇలా

నేత్రదానం 15–20 నిమిషాల్లో పూర్తయ్యే ప్రక్రియ. కంటి భాగంలోని కార్నియాను మాత్రమే తీసుకుంటారు. చాలా మందిలో కన్ను మొత్తాన్ని తీసుకుంటారన్న అపోహ ఉంది. నేత్రాలను తొలగించిన వెంటనే సహజమైన కన్నుల మాదిరిగా కనిపించే కృత్రిమ కన్నును అమర్చుతారు. మరణించిన ఆరు గంటల్లోగా కార్నియాను సేకరించాలి. ముందుగా ఐ బ్యాంకు వారికి సమాచారం ఇవ్వాలి. వారు వచ్చేలోగా రెండు కనురెప్పలను మూసివేసి, దూది లేదా మెత్తని వస్త్రాన్ని వాటిపై కప్పి ఉంచాలి. మృతదేహాన్ని ఫ్రీజర్‌లో పెట్టినా, ఈ జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

అవగాహన కల్పిస్తున్నాం



నేత్రాలను దానం చేసేందుకు ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన లేకుండా పోయింది. నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లాలో వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. నేత్రదానం చేసేందుకు ఇప్పుడిప్పుడు ప్రజలు ముందుకు వస్తున్నారు. 2009 నుంచి ఇప్పటి వరకు 777 మందికి అమర్చాము. – డాక్టర్ కె.త్రినాథరావు, జిల్లా అంధత్వ నివారణ అధికారి, శ్రీకాకుళం



జిల్లా కేంద్రంలో అంధత్వ నివారణ ర్యాలీ ప్రారంభిస్తున్న జేసీ ఎం.నవీన్(ఫైల్)

క్లుప్తంగా

హుండీల చోరీకి విఫలయత్నం



ఎల్లారమ్మ ఆలయంలో హుండీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

గంట్యాడ: ఆలయాల చోరీకి అగంతుకులు విఫలయత్నం చేశారు. మండల కేంద్రం గంట్యాడలో ఉన్న ఆంజనేయస్వామి, ఎల్లారమ్మ ఆలయాల్లో ఉన్న హుండీలను బుధవారం రాత్రి చోరీ చేసేందుకు దుండగులు విఫలయత్నం చేశారు. హుండీ తాళం రాకపోవడంతో ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని తుప్పల్లో పడేశారు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు చెప్పడంతో క్లూస్ టీంను రప్పించి ఆలయాన్ని, హుండీలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్టు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

ఆటోబోల్తా: నలుగురికి గాయాలు

రేగిడి: మండలంలోని కాగితాపల్లి గ్రామ సమీపంలో గురువారం ఆటో బోల్తాపడి పలువురికి గాయాలయ్యాయి. వంగర మండలంలో ఓ శుభకార్యక్రమానికి శ్రీకాకుళం నుంచి వెళ్తున్న ప్రయాణికుల ఆటో మలుపువద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని తప్పించబోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ చిన్నారావు, అనకాపల్లి లక్ష్మి, కాలెపు సుజాత, దమ్మల ప్రియలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వారికి 108 వాహనం పైలెట్ నారాయణరావు, ఈఎంటీ జగదీష్‌లు ప్రాథమిక చికిత్స అందించి రాజాం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై రేగిడి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

40 కోళ్ల అపహరణ

జామి: మండలకేంద్రం జామిలో కొత్తలివారి కళ్లాల వద్ద భీమసింగి గ్రామానికి చెందిన మురళి మేలు జాతి కోళ్లను షెడ్డులో పెంచుకుంటున్నాడు. బుధవారం రాత్రి షెడ్డు తాళాలు పగలగొట్టి సుమారు 40 కోళ్లను దుండగులు అపహరించారు. దీంతో బాధితుడు గురువారం షెడ్డువద్దకు వచ్చి చూసేసరికి కోళ్లు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ కృష్ణారావు

పార్వతీపురం టౌన్: వాకింగ్ చేస్తున్న మహిళ మెడలో బంగారం పుస్తెలతాడును ఓ దుండగుడు తెంచి పరారయ్యాడు. గురువారం వేకువ జామున జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని వైకేఎం కాలనీకి చెందిన జవ్వాది మాధురి ఉదయం నాలుగు గంటల ప్రాంతంలో వాకింగ్ చేస్తూ పువ్వులు కోస్తుండగా గుర్తు తెలియని దుండగుడు వెనకనుంచి వచ్చి పుస్తెలతాడు తెంపి పారిపోయాడు. దీంతో బాధిత మహిళ స్థానికుల సాయంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్ష

శృంగవరపుకోట: రెండు చెక్ బౌన్స్ కేసుల్లో ముద్దాయి సునీల్‌కుమార్ జైన్‌కు ఆర్నెలలు చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి సబ్బవరపు వాణి గురువారం తీర్పు చెప్పారు. ఒక కేసులో రూ.11,47,000, మరో కేసులో రూ9,09,000 పరిహారం తొమ్మిది శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. చెల్లని చెక్‌లు పొంది నష్టపోయిన బాధితుల తరపున సీనియర్ న్యాయవాది టీటీవీ రమణాజీ వాదనలు వినిపించారు.

పీఎస్ నాయుడు పలువురికి ఆదర్శం



అంతర్జాతీయ అథ్లెటిక్ నాయుడు దంపతులను సత్కరిస్తున్న చాన్సలర్ జీఎస్ఎన్ రాజు

నెల్లిమర్ల రూరల్: సమాజంలో అందరికీ మార్గదర్శకంగా నిలిచిన పున్నపురెడ్డి సన్యాసినాయుడు ఆదర్శ ప్రాయుడని సెంచూరియన్ వర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. ఇటీవల శ్రీలంకలోని కొలంబో రాజపక్షే స్టేడియంలో నిర్వహించిన అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పోల్‌వాల్ట్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన సన్యాసినాయుడిని టెక్కలి వర్సిటీలో గురువారం ఘనంగా సన్మానించారు. పట్టుదలతో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన నాయుడిని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా చాన్సలర్ సూచించారు.

ముగ్గురు వీఆర్‌వోల సస్పెన్షన్

పాచిపెంట: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న ముగ్గురు వీఆర్‌వోలపై కలెక్టర్ నిషాంత్‌కుమార్ సస్పెన్షన్ విధించినట్లు తహసీల్దార్ ఎం.రాజశేఖర్ గురువారం తెలిపారు. మాతుమూరు వీఆర్వో కె.సూర్యనారాయణ, పాచిపెంట-1 వీఆర్వో శంకరరావు, అలాగే విధులకు గైర్హాజరవుతున్న పాచిపెంట-2 వీఆర్వో విజయానంద్‌లు సస్పెన్షన్‌కు గురైనట్లు చెప్పారు.

హరికథకు ఆద్యుడు ఆదిభట్ల

- నారాయణ దాసు 159వ జయంతోత్సవాలు ప్రారంభం
- ఆకట్టుకున్న కపిలేశ్వరపురం విద్యార్థుల హరికథాగానం



వెన్‌లాక్ లైబ్రరీలో ఆదిభట్ల విగ్రహానికి పూలమాలాంకరణ చేస్తున్న ఆరాధనోత్సవ సంఘం ప్రతినిధులు

విజయనగరం టౌన్: హరికథకు ఆద్యుడు, సంగీత సాహిత్య సార్వభౌమ, లయబ్రహ్మ, ఆటపాటల మేటి హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదిభట్ల నారాయణదాసు ఆరాధనోత్సవ సంఘం ఆధ్వర్యంలో విజయనగరంలోని కానుకుర్తివారి వీధిలో ఉన్న ఆదిభట్ల గృహంలో తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం వెన్‌లాక్ పార్కులో, సంగీత కళాశాలలో ఉన్న ఆయన విగ్రహాలకు పూలమాలాలంకరణ చేశారు. ఈ సందర్భంగా ర్యాలీగా లయన్స్ కమ్యూనిటీ హాల్‌కి చేరుకున్నారు. వేదిక వద్ద ఆదిభట్ల నారాయణ దాసు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాగంగా కపిలేశ్వరపురం శ్రీ సర్వారాయ హరికథా పాఠశాల విద్యార్థినులు పి.హరిప్రియ 'శ్రీరామ జననం', ఎన్.శిల్ప సుభద్రా కల్యాణం హరికథలను చెప్పి, ఆహుతుల ఆశీస్సులందుకున్నారు. సాయంత్రం కార్యక్రమంలో హరికథాచూడామణి కాళ్ల నిర్మల భాగవతారిణి ఆలపించిన సీతా కల్యాణం హరికథ ఆద్యంతం ఆకట్టుకుంది. సభా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర పాలక సంస్థ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమానికి ఎ.రంగారావు దొర అధ్యక్షత వహించారు. అనంతరం హరికథా చూడామణి వై.శిఖామణి భాగవతారిణి నిర్వహించిన భక్త ప్రహ్లాద కథాగానం చూపరులను కట్టిపడేసింది. ఆరాధనోత్సవ సంఘం ప్రతినిధులు డాక్టర్ ఎ.గోపాలరావు, పీవీ.నరసింహరాజు (బుచ్చిబాబు) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భోగరాజు సూర్యలక్ష్మి, కాళ్ల నిర్మల, అప్పసాని రంగారావు దొర, కపిలేశ్వరపురం శ్రీ సర్వారాయ హరికథ పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.సింగరాచార్యులు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో ఆదిభట్ల జయంతి

మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఆదిభట్ల జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీఎల్ఎస్.శాస్త్రి ఆయన విగ్రహానికి పుష్పమాలాంకరణ చేశారు. అనంతరం కళాశాల తొలి ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆదిభట్లను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణలో విగ్రహానికి పూలమాలాంకరణ చేస్తున్న ప్రిన్సిపాల్ శాస్త్రి



లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో హరికథా గానం చేస్తున్న సర్వారాయ హరికథా పాఠశాల విద్యార్థిని

సకల కళా స్వరూపుడు ఆదిభట్ల

సకల కళా స్వరూపుడు ఆదిభట్ల నారాయణ దాసు అని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ పేర్కొన్నారు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 159వ జయంతిని పురస్కరించుకుని శ్రీ ఆదిభట్ల ఫౌండేషన్ ఆనందనారాయణదాసు ఆధ్వర్యంలో ఆదిభట్ల గృహంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆదిభట్ల మనుమరాలు కామేశ్వరమ్మ దాసు విగ్రహానికి పూలమాలలేసి వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ మాట్లాడుతూ సంగీత సాహిత్యాలను ఔపోసన పట్టిన సరస్వతీ స్వరూపమని ఆదిభట్లను కొనియాడారు. అనంతరం సాహితీవేత్త డాక్టర్ ఎ.గోపాలరావు, ప్రముఖ హరికథకులను, కళాకారులను ముఖ్య అతిథి కృష్ణమోహన్, సత్కరించారు. కార్యక్రమంలో ఆనంద నారాయణదాసు, మంజూష, రాజ్యలక్ష్మి, గురజాడ ఇందిర, హిమబిందు, సూర్యనారాయణ, పద్మనాభం, సూర్యకాంతి, తదితరులు పాల్గొన్నారు.



ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న ఆదిభట్ల ఫౌండేషన్ ప్రతినిధులు

కారు ఢీకొని యువకుడి మృతి

భోగాపురం: మండల కేంద్రంలోని సుందరపేట జాతీయ రహదారిపై గురువారం కారు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరంలోని దాసన్నపేటకు చెందిన మల్లేడ నారాయణరావు(35) సొంత పనుల నిమిత్తం టీవీఎస్ బైక్‌పై భీమిలి మండలం చిప్పాడ వెళ్లాడు. పనులు ముగించుకుని తిరిగి విజయనగరం వెళ్తుండగా సుందరపేట చేరుకునేసరికి శ్రీకాకుళం నుంచి ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో నారాయణరావు తీవ్ర గాయాలపాలవడంతో కారు డ్రైవర్ విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

మరో ప్రమాదంలో కారు ఢీకొని మహిళ..

మండలంలోని సవరవిల్లి జాతీయ రహదారిపై గురువారం మధ్యాహ్నం కారు ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. సవరవిల్లి గ్రామానికి చెందిన బోర దుర్గమ్మ(54) జాతీయ రహదారి దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి కుమారుడు బంగారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి..

కొమరాడ: మండలంలోని గుమడ, కూనేరు రైల్వేస్టేషన్ల మధ్య గురువారం జంబోలైన్‌పై గుర్తుతెలియని వ్యక్తిని గూడ్స్ ట్రైన్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై స్థానికుల సమాచారం మేరకు పార్వతీపురం రైల్వేపోలీసులు ఆరాతీసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చీపురుపల్లి రూరల్: మృతిచెందిన వెంకటరమణ

బైక్ అదుపుతప్పి

చీపురుపల్లి రూరల్: చీపురుపల్లి మండలం బెవర పేట జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి పడిపోయి శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పెద్ద లింగాలవలస గ్రామానికి చెందిన భోగి చినవెంకటరమణ(34) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ఈ ప్రమాదానికి సంబంధించిన మృతుని సోదరుడు లక్ష్మునాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ వైజాగ్‌లోని పరవాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ గాజువాకలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. ఇటీవల చీపురుపల్లి మండలంలోని ముల్లుపేట గ్రామంలో గల బంధువుల ఇంట్లో వివాహానికి హాజరయ్యాడు. వివాహం అనంతరం బుధవారం రాత్రి 12గంటల తరువాత స్వగ్రామం పెద్ద లింగాలవలసకు బైక్‌పై వస్తుండగా బెవరపేట జంక్షన్ వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న బంటాలో పడిపోయి మృతిచెందాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డైట్ ఫస్ట్ సెమిష్టర్ ఫలితాలు విడుదల

పార్వతీపురంటౌన్: డైట్ మొదటి సెమిష్టర్ ఫలితాలు విడుదలైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ 19, 2023 నుంచి జూన్ 24 వరకు నిర్వహించిన పరీక్షకు 3,885 మంది విద్యార్థులు హాజరుకాగా, 2,480 మంది (63.83 శాతం) ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు కళాశాల సమాచారం కోసం డమ్మీమెమోరాండం కోసం డబ్ల్యూడబ్ల్యూ.బీఎస్సీ.ఏపీ.జీఓవీ.ఇన్‌ను సంప్రదించాలన్నారు. మార్కుల రీకౌంటింగ్ కోసం ఈ నెల 9వ తేదీలోగా సీఎంఎఫ్ఎస్‌లో రూ.500 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రతిభా విద్యార్థులకు కెనరాబ్యాంక్ ప్రోత్సాహకం

సాలూరు: మండలంలోని కురుకూటి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థినులకు స్థానిక తోణాం కెనరాబ్యాంక్ అధికారులు నగదు ప్రోత్సాహకాలు అందించి అభినందించారు. ఈ మేరకు హెచ్ఎం ఆశారాణి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలుస్తూ ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు బ్యాంకు మేనేజర్ ప్రసాద్ శాఖాపరంగా నగదు ప్రోత్సాహకాలను అందించి అభినందించారు. 6,7 తరగతుల విద్యార్థినులకు చెరో రూ.2,500, 8,9,10 తరగతుల విద్యార్థినులకు రూ.5వేలు చొప్పున నగదును అందించారు. బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలను చేపడుతున్నామని మేనేజర్ తెలిపారు.



విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలు అందించి అభినందిస్తున్న బ్యాంకు మేనేజర్ ప్రసాద్

240 లీటర్ల సారా సీజ్

- ఇద్దరి అరెస్ట్
- మరో ఇద్దరిపై కేసు నమోదు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం ములగ గ్రామంలో సారారవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిశా రాష్ట్రం నుంచి ఆంధ్రా ప్రాంతానికి సారా రవాణా జరుగుతుండగా 80 లీటర్ల సారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి పార్వతీపురం మండలం తానవలస గ్రామానికి చెందిన మండంగి చిన్నారావును అరెస్టు చేశారు. మరో సంఘటనలో పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామ సమీపంలో 160 లీటర్ల సారాతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, పార్వతీపురం మున్సిపాలిటీ పాతరెల్లివీధికి చెందిన రాయిపల్లి జెన్నును అరెస్టు చేశారు. ఈ రెండు కేసులకు సంబంధించి మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర, ఎస్సై వీవీ రమణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న సారాతో సీఐ ఉపేంద్ర

పైడితల్లి పండగ తేదీలు ఖరారు

- అక్టోబర్ 4న పందిరి రాట
- ఆ రోజునుంచే మండల దీక్షలకు శ్రీకారం
- అక్టోబర్ 30న తొలేళ్ల ఉత్సవం, 31న సిరిమానోత్సవం
- ఉత్సవ వివరాలు వెల్లడించిన ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి

విజయనగరం టౌన్: పసిడి తల్లి పండగ వస్తుందంటే అందరికీ ఆనందమే. ఆ తల్లి కరుణా, కటాక్ష వీక్షణాల కోసం ఎందరో భక్తులు వేచిచూస్తుంటారు. జీవితంలో ఒక్కసారైనా అమ్మ జాతరను కనులారా వీక్షించాలని పరితపిస్తుంటారు. సిరిమానోత్సవంలో పాల్గొని తల్లి ఆశీర్వాదం పొందుతారు. అంతటి ప్రాశస్త్యం కలిగిన పైడితల్లి నెలరోజుల పండగ రానే వచ్చింది. అందరినీ ఆనందపరవశంలో ముంచెత్తింది. రాష్ట్ర పండగగా గుర్తించడంతో అధికారయంత్రాంగమంతా అమ్మపండగకు రంగం సిద్ధం చేస్తోంది. పైడితల్లి అమ్మవారి కల్యాణమండపంలో ఈ ఏడాది పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు సంబంధించిన వివరాలను ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి గురువారం వెల్లడించారు. పండగను విజయవంతం చేయాలని భక్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ట్రస్టు బోర్డు సభ్యులు వి.శ్రీనివాసరావు, అచ్చిరెడ్డి, పి.వెంకటరావు, గంధం లావణ్య, గొర్లె ఉమ, వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, వెలువలపల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



పైడితల్లి అమ్మవారు

పండగ సాగేదిలా...

పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 4 నుంచి నవంబర్ 15వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నవి. అక్టోబర్ 4న బుధవారం మండల దీక్షలు చదురుగుడి వద్ద ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయి. అదేరోజు చదురుగుడి ఆవరణలో ఉదయం 9.30 గంటలకు, వనంగుడి ఆవరణలో ఉదయం 11 గంటలకు పందిరిరాట వేసి ఉత్సవాలు ప్రారంభిస్తారు.

- అక్టోబర్ 25న బుధవారం అర్ధమండల దీక్షలు నిర్వహిస్తారు. 30న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 31న మంగళవారం సిరిమాను ఉత్సవం జరిపేందుకు ముహూర్తం ఖరారు చేశారు.
- నవంబర్ 7న మంగళవారం పెద్దచెరువులో అమ్మవారి తెప్పోత్సవం, నవంబర్ 11న శనివారం సాయంత్రం 5.30 గంటలకు రైల్వేస్టేషన్ వద్ద వనంగుడి నుంచి అమ్మవారి కలశ జ్యోతుల ఊరేగింపు ఉంటుంది.
- నవంబర్ 14న మంగళవారం చదురుగుడి వద్ద ఉయ్యాల కంబాల మహోత్సవం, 15న బుధవారం వనంగుడి ఆవరణలో చండీహోమం, పూర్ణాహుతి, దీక్షావిరమణలు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతాయి.



పైడితల్లి అమ్మవారి జాతర వివరాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ కెఎల్.సుధారాణి, ట్రస్టు బోర్డు సభ్యులు

అధునాతన అంబులెన్సులతో వైద్య సేవలు

- జిల్లాలో 28 వాహనాలు
- ఫోన్ చేసిన నిమిషాల్లోనే సంఘటనా స్థలానికి హాజరు

విజయనగరం ఫోర్ట్: గత ప్రభుత్వం హయాంలో శిథిలావస్థకు చేరిన 108 అంబులెన్సులకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్వ వైభవం తీసుకువచ్చింది. అంతేకాకుండా శిథిలావస్థలో ఉన్న వాహనాలు అన్నింటిని మార్చేసి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చిందిజ ఆస్పత్రికి చేరే లోపే రోగులకు చికిత్స అందడంతో అనేక మంది పునర్జన్మ పొందుతున్నారు.



108 అంబులెన్సు

జిల్లాలో 28 వాహనాలు

జిల్లాలో 108 అంబులెన్సులు 28 ఉన్నాయి. వాటిలో రెండు అంబులెన్సులు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు వాహనాలు. ఒకటి నవజాత శిశువులకు సేవలు అందించే నియోనేటల్ అంబులెన్సు. మిగిలిన 25 లైఫ్ సపోర్టు అంబులెన్సులు.



బొండపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న వాహనం (ఫైల్)

హుటాహుటిన సంఘటన స్థలానికి

ఆపదలో ఉన్నామని ఫోన్‌రాగానే 108 అంబులెన్సు సంఘటనా స్థలానికి హుటాహుటిన వాలిపోతుంది. పట్టణ ప్రాంతంలో 15 నుంచి 16 నిమిషాల్లో.. గ్రామీణ ప్రాంతాల్లో 20 నుంచి 22 నిమిషాల్లో అంబులెన్సు సంఘటనా స్థలానికి చేరుకుంటుంది. సకాలంలో ఆస్పత్రికి చేర్చడం వల్ల వల్ల ఎంతో మంది ప్రాణాపాయస్థితి నుంచి బయట పడుతున్నారు.



గర్భిణికి ప్రసవం జరిపించిన 108 సిబ్బంది (ఫైల్)

కరోనా సమయంలో కూడా 108 అంబులెన్సులు నిర్విరామంగా సేవలు అందించాయి. 7 నెలల కాలంలో 22. 253 మందిని ఆస్పత్రికి చేర్చాయి.

రోగి కోరుకున్న ఆస్పత్రికి తరలింపు

ఇంటి దగ్గర ఉన్న రోగి ఏ ఆస్పత్రి కోరుకుంటే ఆ ఆస్పత్రికి 108 అంబులెన్సులో తరలిస్తారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు సంబంధిత వైద్యుడు ఏ ఆస్పత్రికి రిఫర్ చేస్తే ఆ ఆస్పత్రికి మాత్రమే తరలిస్తారు. 108 అంబులెన్సుల్లో . గర్భిణిని ఆస్పత్రికి తరలించే సమయంలో పురిటి నొప్పులు ఎక్కువైతే మార్గమధ్యంలో సిబ్బంది ప్రసవం జరిపిస్తున్నారు.

సకాలంలో వైద్యం అందేలా చూస్తున్నాం



108కు ఫోన్ రాగానే సకాలంలో అంబులెన్సును పంపించి ఆస్పత్రికి చేరుస్తున్నాం. నవజాత శిశువుల వైద్యం కోసం కూడా నియోనేటల్ అంబులెన్సును వినియోగించుకుంటున్నారు. రోగుల ప్రాణాలు కాపాడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సేవలు అందిస్తున్నాం.

నజీర్ హుస్సేన్, 108 జిల్లా మేనేజర్

ఆహా కేంటీన్ ప్రారంభం

పార్వతీపురంటౌన్: సాధారణ ప్రజలకు తక్కువ ధరకే భోజన సదుపాయం కల్పించేలా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ-ఆంధ్రప్రదేశ్ (మెప్మా), పార్వతీపురం పురపాలక సంఘం సమష్టిగా పార్వతీపురం బెలగాం చర్చి సెంటర్లో ఏర్పాటు చేసిన ఆహా కేంటీన్‌ను ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల అభ్యున్నతికి, ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రతి మహిళను లక్షాధికారిగా చేసేందుకు ఆర్థిక తోడ్పాటు నందిస్తున్నట్టు వెల్లడించారు. ఆహా కేంటీన్‌ను ఏర్పాటుచేసిన మహిళా సంఘ సభ్యులను అభినందించారు. తక్కువ ధరకే రుచికరమైన భోజనం వడ్డించి అందరి మన్ననలు అందుకోవాలని, వ్యాపారం చక్కగా సాగాలని ఆకాంక్షించారు. రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని మహిళలందరూ ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇ.గున్నేశ్వరరావు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మెప్మా సభ్యులు, అధికారులు, ఆర్పీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

స్త్రీనిధి రుణాల చెల్లింపులకు పేటీఎం మిషన్‌ల పంపిణీ

విజయనగరం అర్బన్: జిల్లాలోని మహిళా పొదుపు సంఘాల స్త్రీనిధి రుణాల చెల్లింపులకు పేటీఎం మిషన్‌లను వినియోగంలోకి తెస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి అన్నారు. స్త్రీనిధి రుణాలు, వసూళ్లు మరింత పురోభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా పేటీఎం వ్యవస్థను తీసుకొస్తున్నామని చెప్పారు. జిల్లాను పైలెట్ కింద ప్రభుత్వం తీసుకుందన్నారు. తొలిదశలో ఎంపిక చేసిన మండలాలకు గురువారం ఆయన తన చాంబర్‌లో పేటీఎం మిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల నుంచి స్త్రీనిధి రుణ చెల్లింపులను పేటీఎం మిషన్ల ద్వారా అమలు చేస్తామని తెలియజేశారు. పైలెట్ కింద ముందుగా నెల్లిమర్ల, జామి, రేగిడి ఆముదాలవలస మండలాలకు పేటీఎం మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు, గరివిడి ఏరియా కో ఆర్డినేటర్ బి.బంగారమ్మ, డీపీఎం (ఐబీ), జె.లక్ష్మునాయుడు, నెల్లిమర్ల మండల ఏపీఎం, ఎల్.సత్యనారాయణ, స్త్రీనిధి మేనేజర్ కె.రమేష్ పాల్గొన్నారు.



పేటీఎం మిషన్ ద్వారా రుణాల చెల్లింపుల విధానాన్ని పరిశీలిస్తున్న పీడీ కల్యాణ చక్రవర్తి